సాక్షి అనకాపల్లి

సోమవారం । 17 । మార్చి । 2025



చింతపండుకు భలే డిమాండ్

ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో చింత పండుకు డిమాండ్ ఏర్పడింది.

8లో



నేత్రపర్వంగా పవళింపు సేవ

జో అచ్చుతానంద, జోజో ముకుందా అంటూ ఉపమాకలో స్వామివారి పవళింపు సేవలు ఘనంగా జరుగుతున్నాయి.

8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	సోమ	మంగళ
అనకాపల్లి	6.11	4.48
నర్సీపట్నం	6.14	4.47

న్యూస్‌రీల్

రసవత్తరంగా రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



చెస్ విజేతలతో నిర్వాహకులు

మాకవరపాలెం: రాష్ట్రస్థాయి చెస్ పోటీలు రసవత్తరంగా సాగాయి. జిల్లా చెస్ అసోసియేషన్, ప్రగతి చెస్ అకాడమీ సంయుక్తంగా తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 180 మంది హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చెస్ పోటీలు ఎంతో రసవత్తరంగా కొనసాగాయి. ఈ పోటీల్లో విశాఖ జిల్లాకు చెందిన అఖిలప్రసాద్ ప్రథమ, ప్రకాశం జిల్లాకు చెందిన జె.కె.రాజు ద్వితీయ, అనకాపల్లి జిల్లాకు చెందిన బి.సాకేత్ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరికి ప్రథమ బహుమతిగా రూ.5,100, ద్వితీయ రూ.4000, తృతీయ రూ.3000 నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవంతి కళాశాల మెకానికల్ విభాగం హెడ్ హరికిరణ్, ప్రగతి చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు సుదీర్, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, గౌతమి లలిత కళా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు పాల్గొన్నారు.

పది ఓపెన్ పరీక్షలకు 19 మంది ఖైదీలు

ఆరిలోవ (విశాఖ): విశాఖ కేంద్ర కారాగారంలో 19 మంది ఖైదీలు పదో తరగతి ఓపెన్ పరీక్షలకు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర కారాగారంలో ఖైదీల కోసం ప్రత్యేకంగా పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఖైదీలకు బుధవారం నుంచి పరీక్షలు జరుగుతాయని జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ఈ పరీక్షల కోసం 21 మంది ఖైదీలు దరఖాస్తులు చేసుకున్నారని, ఇద్దరు ఇటీవల జైల్ నుంచి రిలీవ్ కావడంతో మిగిలిన 19 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు కూడా 11 మంది ఖైదీలు రాసినట్టు తెలిపారు.

రేపు మధ్యాహ్నం 12 గంటల నుంచి దర్శనాలు

కొమ్మాది (విశాఖ): రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనాలు కల్పిస్తామని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయం ప్రకారం ముందుగా వచ్చే మంగళవారం ఆలయ శుద్ధి, కోయల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తామన్నారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆల యాన్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేసి, అనంతరం యథావిధిగా సర్వదర్శనాలు కొనసాగిస్తామన్నారు.

నేడు జీవీఎంసీలో పీజీఆర్‌ఎస్

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఇన్‌చార్జ్ కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

నేడు ఆరోగ్య మిత్రల నిరసన

మహారాణిపేట (విశాఖ): ఏపీ ఆరోగ్య మిత్ర, ఇతర సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం మళ్లీ ఉద్యమబాట పట్టారు. గతంలో నిరసనలు తెలిపినా కూటమి ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం, ఈ నెల 12న జరిగిన చర్చలు విఫలం కావడంతో దశల వారీగా ఆందోళనలు చేపట్టేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద గల జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తెలపనున్నారు. ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్, ఏపీ వైద్య సేవ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ నెల 17, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ గోవింద తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 27న మంగళగిరిలో ట్రస్ట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విజయోస్తు..



నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

హాజరుకానున్న విద్యార్థులు

రెగ్యులర్	22,042
ఓపెన్ స్కూల్	667
ప్రైవేటు విద్యార్థులు	1,258

పరీక్షలు ఎప్పటివరకంటే : సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ

పరీక్షా సమయం : ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటలు

- జిల్లాలో 107 పరీక్ష కేంద్రాలు
- ఏడు ప్రత్యేక స్క్వాడ్ బృందాలు
- ఏర్పాట్లు పరిశీలించిన విద్యాశాఖ రాష్ట్ర అదనపు సంచాలకుడు శ్రీనివాసరావు

తుమ్మపాల: విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించాలని, పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు, విద్యాశాఖ రాష్ట్ర అదనపు సంచాలకుడు పి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలో పలు పరీక్ష కేంద్రాలను ఆయనతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావునాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు రాయడానికి అనుకూలంగా బెంచీలు ఉండాలని, ఫ్యాన్లు తిరిగేలా చూడాలని, సురక్షిత తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతకు ముందు ఆయన పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణ, స్క్వాడ్ బృందాల అధికారులతో మాట్లాడుతూ ఎక్కడ ఏ లోపాలున్నా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు మాట్లాడుతూ జిల్లాలో 107 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ఏడు సెంటర్లలో ఎస్‌ఎస్‌సీ బోర్డు విద్యార్థులతో పాటు ఓపెన్ స్కూల్ విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తారన్నారు. 22 వేల 42 మంది రెగ్యులర్, 1258 ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అలాగే 667 మంది ఓపెన్ స్కూల్ అభ్యర్థులు పరీక్షలు రాస్తారన్నారు.



ఎంజీహెచ్ పాఠశాలలో పరీక్ష ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర అదనపు సంచాలకుడు శ్రీనివాసరావు, డీఈవో అప్పారావునాయుడు

పరీక్షల కోసం ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, అవసరం మేరకు ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఏడు ప్రత్యేక స్క్వాడ్ బృందాలను నియమించమన్నారు. జిల్లా కలెక్టర్‌తో సహా జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు పరీక్షల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తారని వివరించారు. పరీక్ష కేంద్రాల ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, సర్వీసులు ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సహకారంతో ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతున్నందున విద్యార్థులంతా ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్వో వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కృష్ణంరాజు, జనార్దన్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



ఎస్పీ తుహిన్ సిన్హా

తుమ్మపాల: ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు ఏప్రిల్ 1 వరకు రాత పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 107 పరీక్ష కేంద్రాల్లో 22,042 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సరిగ్గా 9 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష కేంద్రం నుంచి బయటికి వెళ్లడానికి అనుమతి లేదన్నారు. సున్నితమైన పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ ఫోన్ తీసుకురాకూడదని, అలాగే క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్ డివైజులు, స్మార్ట్ వాచ్‌లు వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిలేదన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జెరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేయాలని ఆదేశించామని తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద గుమికూడడం నిషేధమని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

- డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు
- పరీక్షల నిర్వహణ అధికారులు, స్క్వాడ్ బృందాలతో సమావేశం

అనకాపల్లి టౌన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు నిర్వహణలో నిబంధనలన్నీ పక్కాగా పాటించాల్సిందేనని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు పేర్కొన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి పరీక్షల నిర్వహణ అధికారులు, స్క్వాడ్ బృందాల సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఏ రూపంలో ఎవరు భాగస్వాములైనా కఠిన చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ఉద్యోగాలతో పాటు క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారన్నారు. పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని, కేంద్రాల పరిసర ప్రాంతాలను కూడా పరిశీలించాలన్నారు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాచ్‌లు తదితర పరికరాలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందరూ హాల్ టికెట్లు ముందుగా తనిఖీ చేసి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. పదో తరగతి బోర్డు, ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, పరీక్షల విభాగం సహాయ సంచాలకులు ఎ.శ్రీధర్ రెడ్డి, విద్యాశాఖ, రెవిన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు

హాల్ టికెట్లు ఆపితే కఠిన చర్యలు

తుమ్మపాల: బకాయిలు, ఇతర కారణాలతో విద్యార్థుల 10వ తరగతి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు నిలుపుదల చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఏ విద్యా సంస్థ నిర్వాహకులైనా విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదులు వస్తే అటువంటి విద్యా సంస్థలపై కఠిన చర్యలు తప్పవన్నారు. తగిన విచారణ చేయించి, ఆ పాఠశాల గుర్తింపును కూడా రద్దు చేస్తామన్నారు.

పరీక్షలకు నలుగురు దివ్యాంగులు

కోటవురట్ల... కొంకోట: టెన్త్ పరీక్షలకు నలుగురు దివ్యాంగులు హాజరవుతారని స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు రమణమ్మ తెలిపారు. స్థానిక బాలికల హైస్కూల్లో చింతల ఆనంద పవన్ ప్రదీప్, వర్షవి, హర్షదీప్, తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో అక్కిరెడ్డి యశ్వంత్ మహేష్ పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. వీరికి పరీక్షలు రాయడానికి స్క్రైబర్లను ఇచ్చినట్లు తెలిపారు.

ఆరోగ్యమస్తు..





యోగాసనాలు వేస్తున్న కలెక్టర్లు

యోగాసనాలు వేసి.. సూర్యనమస్కారాలు చేసిన కలెక్టర్ దంపతులు

బొజ్జన్నకొండ వద్ద సైకిల్ ర్యాలీ

అనకాపల్లి టౌన్: జిల్లా కలెక్టర్లు వారు, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ హోదా వారిది. ఒకరిది అనకాపల్లి జిల్లా అయితే.. ఇంకొకరిది అల్లూరి జిల్లా. వారిద్దరు విజయకృష్ణన్.. దినేష్ కుమార్ దంపతులు. నిరంతరం అధికారులు, ప్రజలతో బిజీగా, క్షణం తీరిక లేకుండా వారి జీవన శైలి ఉంటుంది.అయితే అందుకు భిన్నంగా ఆదివారం ఆటవిడుపుగా కొంత సేపు సైక్లింగ్ చేశారు. అలాగే సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేశారు. ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా పేరొందిన బొజ్జన్న కొండ ఆవరణలో కలెక్టర్ దంపతులు యోగాసనాలు వేశారు. స్థానికులతో ఫొటోలు దిగారు.

ఫిట్‌నెస్ కోసం యోగా, సైక్లింగ్

మనిషి దైనందిన జీవితంలో యోగా అతి ముఖ్యమైనదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం రోజు కనీసం ఒక గంట యోగా, సైక్లింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. యోగా లైఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఐదు కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ కార్యక్రమం జరిగింది. తుమ్మపాల నుంచి ప్రారంభమైన ర్యాలీ అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్, సూర్యనారాయణ ఆలయం మీదుగా బొజ్జన్న కొండకు చేరుకుంది. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ కూడా పాల్గొని సైక్లింగ్ చేశారు. ర్యాలీ అనంతరం బొజ్జన్న కొండకు చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ మనిషికి ఫిజికల్ ఫిట్‌నెస్ చాలా ముఖ్యమని కోవిడ్ లాంటి మహమ్మారిని ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కాలని, దీనివల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ర్యాలీలో డాక్టర్ శ్రీరామమూర్తి, యోగా లైఫ్ ఫౌండర్ బాబూరావు, ట్రైనర్స్ దేవికా, రమాదేవి, మణికంఠ, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



సైక్లింగ్ చేస్తున్న కలెక్టర్లు విజయకృష్ణన్, దినేష్‌కుమార్‌లు

గోవాడ సుగర్స్‌లో మళ్లీ నిలిచిన క్రషింగ్



ఫ్యాక్టరీ ఆవరణలో పెద్దసంఖ్యలో నిలిచిపోయిన చెరకు బళ్లు

చోడవరం: గోవాడ సుగర్స్ క్రషింగ్‌కు మళ్లీ అంతరాయం కలిగింది. బాయిలర్ హౌస్‌లో సమస్య తలెత్తడంతో ఆదివారం క్రషింగ్ నిలిచిపోయింది. ఆర్థిక ఇబ్బందులు, కార్మికుల సమ్మెలతో ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభించడమే ఆలస్యంగా జరిగింది. ఇప్పటికే అనేక సార్లు బెగాస్ కొరత, బాయిలర్ హౌస్‌లో సమస్యలతో క్రషింగ్‌కు అంతరాయం కలుగగా మరలా బాయిలర్ ఈటీపీ ప్లాంట్‌లో సమస్య తలెత్తడంతో మరోసారి క్రషింగ్ నిలిచిపోయింది. రాత్రి అయినా క్రషింగ్ ప్రారంభం కాకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇదిలావుండగా క్రషింగ్ నిలిచిపోవడంతో మరలా యథావిధిగా ఫ్యాక్టరీ యార్డుల వద్ద చెరకు కాటాల వద్ద పెద్ద సంఖ్యలో చెరకు లోడుతో వాహనాలు నిలిచిపోయాయి. తరుచూ ఉత్పన్నమౌతున్న అంతరాయం సమస్యతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ పరిధిలో చెరకు లేక క్రషింగ్ ఆశించిన మేర జరగదని ముందు భావించినప్పటికీ చెరకు పుష్కలంగా సరఫరా అవుతుండడంతో ఇప్పటికే 80వేల టన్నులు దాటి క్రషింగ్ కూడా జోరుగానే సాగుతుంది. ఈ పరిస్థితుల్లో ఫ్యాక్టరీలో తరుచూ మరమ్మతుల సమస్యలు తలెత్తుతుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఈ ప్లేట్లు...

క్లీన్ అండ్ గ్రీన్

ఎండు గడ్డి, అరటి బెరడుతో డిస్పోజబుల్ ప్లేట్ల తయారీ

పర్యావరణ హితం, ఆరోగ్య దాయకం

రైతుకు అదనపు ఆదాయం

ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ



ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త జగన్నాథరావుతో విద్యార్థులు



సాక్షి, అనకాపల్లి: అధిక పెట్టుబడులతో ఆశించిన దిగుబడి లేక రైతు నష్టాల బాట పడుతున్నాడు. వాతావరణ మార్పులు, ఇతర పరిస్థితుల కారణంగా పంట నష్టపోయి లాభాలార్జించలేని పరిస్థితిలో రైతు ఉన్నాడు. దేశంలోనే వరి పంట పండిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ టాప్ టెన్‌లో ఉంది. రైతు మీదే యావత్ దేశం ఆధారపడుతుంది. అందుకే రైతుకు మేలు చేకూరేలా..అదే విధంగా పర్యావరణాన్ని పరిరక్షించేలా.. అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు, అగ్రికల్చర్ విద్యార్థులు ప్రయోగాత్మకంగా ఎండు గడ్డి, అరటి కాండంతో డిస్పోజల్ ప్లేట్లు తయారు చేశారు. రైతుకు అదనపు ఆదాయం సంపాదించుకునేలా సరికొత్తగా ప్రాజెక్టు చేసి చూపించారు. ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు, డాక్టర్ ఎ.కేశవకుమార్, ఈవీఎస్ కుమారి పర్యవేక్షణలో అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ థర్డ్ ఇయర్ విద్యార్థులు రక్షిత, ఎం.కీర్తి స్వరూప, పి.గురుసాయి, ఆర్.ఉదయ్‌కుమార్ ఈ ప్రయోగం ద్వారా డిస్పోజల్ ప్లేట్లు తయారు చేయవచ్చని చేసి చూపించారు. వరి పంట వేసే రైతు నూర్పు తరువాత ఎండు గడ్డిని కొంతమేర పశువులకు మేతగా ఉపయోగిస్తాడు..పశువులు తినగా మిగిలిన మరికొంత గడ్డి పశువుల పాకలుగా వాడుతుంటారు. తరువాత కూడా మిగిలి వృథాగా పడి ఉన్న ఎండు గడ్డిని కాల్చివేస్తుంటారు. ఇలా వృధా చేసేకంటే ఆ గడ్డితో డిస్పోజల్ ప్లేట్లు తయారీ చేసుకుని అదనపు ఆదాయం ఆర్జించవచ్చని ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొన్ని చోట్ల మిగిలిపోయిన ఎండు గడ్డి కాల్చడం ద్వారా కార్బన్ డైఆక్సైడ్ విడుదలై పర్యావరణం కూడా కలుషితమయ్యే అవకాశం ఉంటుంది. ఈ పొగ ద్వారా ఆస్తమా, శ్వాసకోస వ్యాధులు వాటిల్లే అవకాశం ఉంటుంది. ఇలా వృథాగా పడి ఉన్న వరిగడ్డిని ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో అగ్రికల్చర్ విద్యార్థులు డిస్పోజబుల్ ప్లేట్లుగా తయారు చేశారు. సరికొత్త ప్రయోగానికి నాంది పలికారు.

అరటి డొప్పతో...

అరటి మొక్క నుంచి గెల కాసిన తరువాత దాన్ని నరికేస్తారు. అలా నరికేసిన అరటి కాండం నుంచి చెట్టు డొప్పల నుంచి ఫైబర్‌ను తీసుకుని వాటిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి బాగా ఎండబెట్టాలి. ఇందులో సోడియం హైడ్రాక్సైడ్ క్రిస్టల్‌ను వేసి ఒక గంట పాటు బాయిల్ చేస్తారు. ఆ పేస్ట్‌ను జల్లెడలో వేసి వాటర్ తీసేస్తారు. షీట్‌ను ప్లేట్ మౌల్డింగ్ మిషన్ దగ్గరకు తీసుకెళతాం. 100 గ్రాములు కాండం నుంచి 5 నుంచి 6 ప్లేట్లు తయారు చేయవచ్చు.



ఎండుగడ్డి, అరటి బెరడుతో తయారు చేసిన ప్లేట్లు

వంద గ్రాములు గడ్డితో 3 ప్లేట్లు

ఎండు గడ్డిని నీటితో శుభ్రంగా కడిగి ముక్కలుగా కట్ చేయాలి. వీటిలో 1 కేజీ గడ్డి ముక్కలు తీసుకుని వాటిని బాగా ఎండబెట్టాలి. సగటున 100 గ్రాముల వరి గడ్డిలో 7 లీటర్ వాటర్ వేసి మరిగించాలి.15 నిమిషాల పాటు బాగా ఉడికించిన తరువాత అందులో సోడియం హైడ్రాక్సైడ్ క్రిష్టల్‌ను వేసి గంటన్నర పాటు ఉడికించాలి. ఆ తరువాత జల్లెడలో వేసి వరిగడ్డి నుంచి నీరును సెపరేట్ చేయాలి. మిగిలిన వరి గడ్డిని మిక్సీలో వేసి పేస్ట్‌లా చేయాలి. ఈ పేస్ట్‌ను ప్లేట్ సైజ్ కన్నా పెద్దగా స్కీన్ లేదా గాజు గ్లాస్‌పై వేసి 24 గంటల పాటు ఎండబెట్టాలి. ఎండిన తరువాత షీట్‌గా ఏర్పడుతుంది. దీనిని హైడ్రాలిక్ ప్రెస్ యంత్రంలో పెట్టి ప్రెస్ చేస్తే ప్లేట్ ఏర్పడుతుంది. ఈ ప్లేట్‌కు పైన విస్తరాకు గానీ లేదా నేలలో కలిసిపోయేలా బయోగ్రేడిబుల్ ఫిల్మ్‌గాని వేస్తారు. దీంతో డిస్పోజల్ ప్లేట్ తయారు అవుతుంది. సగటున 100 గ్రాముల వరి గడ్డికి 3 నుంచి 4 ప్లేట్లు తయారవుతాయి.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా...

ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో పర్యావరణం దెబ్బతింటుంది. ఎక్కువగా వినియోగించే డిస్పోజబుల్ ప్లేట్లతో మరింతగా పర్యావరణం దెబ్బతింటుంది. అంతేకాకుండా రైతులు పండించే వరిలో వృథాగా పడేసే ఎండుగడ్డి వంటివి కాల్చడం ద్వారా కార్బన్‌డైఆక్సైడ్ విడుదల అవుతుంది. అందుకే మా విద్యార్థులతో కలిసి ఎకో ఫ్రెండ్లీ డిస్పోజబుల్ ప్లేట్లు ప్రయోగాత్మకంగా తయారీ చేశాం.పర్యావరణాన్ని కాపాడడంతో పాటు రైతు లకు అదనంగా ఆదాయం వచ్చేలా ఉపయోగపడేలా రూపొందించాం.



–డాక్టర్ ఎ. కేశవ్‌కుమార్, టీచింగ్ అసోసియేట్, పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్. అనకాపల్లి

రైతుకు ఎంతో మేలు..



నేను అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలో గల అనకాపల్లి పాలిటె క్నిక్ ఇంజినీరింగ్‌లో థర్డ్ ఇయర్ చదువుతున్నాను. మూడు నెలల పాటు నేను చేసిన ప్రాజెక్ట్‌లో భాగంగా పర్యావరణాన్ని కాపాడుతూ..రైతుకు మేలు చేకూర్చేలా ఈ ప్రయోగ విధానం చేశాం. రైతుకు పంట దిగుబడి అనంతరం వృథాగా పడేసే గడ్డితో డిస్పోజబుల్ ప్లేట్లు తయారు చేసుకోవచ్చు.సోడియం హైడ్రాక్సైడ్ క్రిష్టల్ కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్లేట్ మౌల్డింగ్ మిషన్ ఒక్కటే కొనుగోలు చేసుకుంటే వారంతట వారే డిస్పోజబుల్ ప్లేట్లు తయారు చేసుకోవచ్చు. ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త జగన్నాధరావు సహకారంతో డిస్పోజబుల్ ప్లేట్లు ప్రాజెక్టు చేశాం.

–కీర్తి స్వరూప, థర్డ్ ఇయర్ విద్యార్థిని, పాలిటెక్నికల్ ఇంజినీరింగ్.

క్లుప్తంగా

మేడివాడలో పరస్పరం దాడులు

ఇరు వర్గాల్లోని ఏడుగురికి గాయాలు

రావికమతం: మేడివాడలో భూ వివాదంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలు, పరస్పరం దాడులు ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసున్నట్టు రావికమతం ఎస్‌ఐ రఘు వర్మ చెప్పారు. ఎస్‌ఐ రఘువర్మ, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మేడివాడలో మిలట్రీ ఉద్యోగి గొర్లి భాస్కరరావు, పతివాడ కోటేశ్వర రావు, కుటుంబాల మధ్య కొన్నాళ్లుగా భూ వివాదంపై గొడవలు జరుగుతున్నాయి. ఇదే కేసులో మిలట్రీ ఉద్యోగి గొర్లి భాస్కరరావు గత ఏడాది అప్పటి ఎస్‌ఐపై దాడికి తెగబడి చెయ్యిని కొరికాడు. అతడిపై పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భాస్కరరావు, కోటేశ్వర రావు మధ్య ఘర్షణ తలెత్తి ఇరు కుటుంబాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో పతివాడ కోటేశ్వరరావు(56), భార్య రేవతి(45), కుమార్తెలు లావణ్య(27), లీలా సంధ్య(26), గొర్లి భాస్కరరావు, అతడి అన్న సత్తిబాబు, అతడి తల్లి వరహాలమ్మ గాయపడ్డారు. భాస్కరరావు వర్గీయులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, పతివాడ కోటేశ్వరరావు కుటుంబీకులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ రఘువర్మ తెలిపారు. ఇరు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్, అధికారులు

ఆరిలోవ(విశాఖ): ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి చిరస్మరణీయుడిగా నిలిచారని అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం విశాఖ జిల్లా విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పోలీస్ అధికారులతో కలిసి ఆయన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఎనలేని కృషి చేశారన్నారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అనుసరించారని, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, హరిజనోద్ధరణ కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మధరావు, ఆర్ఎస్‌ఐ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపండుకు భలే డిమాండ్

- దేవరాపల్లి వారపు సంతలో హాట్‌కేకుల్లా విక్రయాలు
- మణుగు రూ.550 నుంచి రూ.650 వరకు పలికిన ధరలు
- ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో ధరలకు రెక్కలు


దేవరాపల్లిలో చింతపండు కొనుగోలుదారులతో కిక్కిరిసిన వారపు సంత

దేవరాపల్లి: ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో చింతపండుకు డిమాండ్ ఏర్పడింది. ధర పెరిగినా దేవరాపల్లిలో ఆదివారం జరిగిన వారపు సంతలో హాట్‌కేకుల్లా విక్రయాలు జరిగాయి. దేవరాపల్లిలో నాణ్యమైన చింతపండుతో పాటు అందుబాటు ధరలో లభిస్తుందని నమ్మకంతో విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి ఇక్కడి సంతకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సంతకు చింతపండు అరకొరగా వచ్చింది. సమీప గిరిజన ప్రాంత నుంచి కూడా తక్కువ మొత్తంలోనే చింతపండు వచ్చింది. కొనుగోలుదారులు అధిక సంఖ్యలో వచ్చినప్పటికి అందుకు తగ్గట్టుగా చింతపండు లేక పోవడంతో డిమాండ్ ఏర్పడింది. కొనుగోలుదారులు పోటీ పడడంతో గంటల వ్యవధిలోనే హాట్ కేకుల్లా అమ్ముడుపోయింది. మణుగు(10 కేజీలు) చింతపండు నాణ్యత ఆధారంగా రూ. 550 నుంచి రూ.650 వరకు ధర పలికింది. సాధారణంగా చింతపండు ధరలు రూ.400 నుంచి రూ.500 వరకు ఉంటాయి. అయితే దిగుబడి తగ్గిపోవడంతోనే అమాంతం ధరలు పెరిగాయని పలువురు అభిప్రాయపడ్డారు. వచ్చే వారం జరిగే సంతకు చింతపండు మరింత తక్కువగా రానుండడంతో ధరలు పెరిగే అవకాశం ఉంటుందని పలువురు కొనుగోలుదారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రాణం తీసిన క్వారీ లారీ

- డ్రైవర్ నిర్లక్ష్యంతో మునగపాకకు చెందిన ఎల్ఐసీ ఏజెంటు మృతి
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్తుల ఆందోళన


ప్రమాదానికి కారణమైన లారీ


కన్నారావు (ఫైల్)


కన్నారావు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య,కుమారుడు

మునగపాక: క్వారీ లారీ వ్యక్తిని బలి తీసుకుంది. పూడిమడక రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలకు అనుమతులు లేకున్నా ఇవేమీ పట్టనట్టు వాహన యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పూడిమడక రోడ్డులో భారీ వాహనాలను అనుమతించవద్దంటూ పలు మార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం కనిపించడం లేదు. దీనికి తోడు లారీ డ్రైవర్లు కూడా ట్రిప్పులకు కక్కుర్తి పడి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారు. కొంతకాలంగా రాంబిల్లి మండలంలోని నేవల్ బేస్‌కు బండరాళ్లను లారీలపై తరలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రాళ్లు రహదారిపై పడిపోతున్నాయి. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వారు నిత్యం భయాందోళనకు గురవుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఆదివారం మునగపాకకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ మాడా కన్నారావు(53) రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాక గ్రామానికి చెందిన మాడా కన్నారావు ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం కన్నారావు తన బైక్‌పై గుడికి వెళ్లేందుకు అవసరమయ్యే సామగ్రి కొనుగోలు కోసం వెళుతుండగా ఇదే సమయంలో రాంబిల్లి మండలం నేవల్ బేస్‌కు రాయి తరలించి తిరిగి అనకాపల్లి వైపు వస్తున్న భారీ లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కన్నారావు బైక్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలంలో భోరున విలపించారు. కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచిన కన్నారావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఈ దుర్ఘటన విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ పూడిమడక రోడ్డులో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమస్య జటిలం కావడంతో కశింకోట సీఐ స్వామినాయుడు, మునగపాక పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులతో చర్చించారు. పూడిమడక రోడ్డులో పగటిపూట భారీ వాహనాలు రాకుండా చూడాలని , అలాగే ప్రమాదాలకు నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం కన్నారావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించగా సంబంధిత డ్రైవర్ పోలీసులకు లొంగిపోయాడు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిపూడి వద్ద 'భూమాత' సరికొత్త వెంచర్


భూమాతాస్ ఎస్‌వీఎన్ స్వప్నలోక్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎండీ పూర్ణ చంద్రరావు, తదితరులు

కొమ్మాది: భూమాత గ్రూప్, ఎస్‌విఎన్ గ్రూప్ సంయుక్తంగా తాటిపూడి వద్ద 200 ఎకరాల్లో భూమాతాస్ ఎస్‌వీఎన్ స్వప్నలోక్ పేరుతో వెంచర్ వేస్తున్నట్లు భూమాత గ్రూప్ ఎండీ తాళ్లూరి పూర్ణ చంద్రరావు తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఓ రిసార్ట్‌లో ఆదివారం సాయంత్రం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఎస్‌విఎన్ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 ఎకరాల్లో 5 ఫేజ్‌ల్లో.. 1650 ప్లాట్లు వీఎంఆర్‌డీఏ అనుమతులతో అందరికి అందుబాటు ధరల్లో నిర్మించినట్లు తెలిపారు. ఈ వెంచర్‌లో ఇంతవరకు రియల్‌ఎస్టేట్ చరిత్రలో ఎవరు ఇవ్వని సౌకర్యాలు, క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. థీమ్డ్ ప్రీమియం రెసిడెన్షియల్ మెగా ప్రాజెక్టుగా కష్టమర్లకు విశ్రాంతి, వినోదం ఇచ్చే ఇలాంటి భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు ఆంధ్రలో ఇదే మొదటిదని తెలిపారు. ఈ వెంచర్‌కు సమీపంలోని తాటిపూడి రిజర్వాయర్‌ను ప్రభుత్వం టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తుండడంతోపాటు 500 ఎకరాల్లో జిందాల్ కంపెనీ టూరిస్ట్ స్పాట్‌గా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఈ వెంచర్ మీదుగా 4 లైన్ల హైవే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్లూరి శివాజీ, కిరణ్ శంకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పవళింపు సేవ


అద్దాల మండపంలో ఉయ్యాలలో స్వామివారికి పవళింపు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: జో అచ్యుతానంద, జోజో ముకుందా అంటూ ఉపమాకలో స్వామివారి పవళింపు సేవలు (పుష్పయాగోత్సవాలు) ఘనంగా జరుగుతున్నాయి. కల్యాణోత్సవాల అనంతరం స్వామివారికి మూడు రోజుల పాటు పవళింపు సేవలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు, గోదాదేవి అమ్మవారికి క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామికి నిత్యపూజలు, ఆరాధనలు నిర్వహించారు. రాత్రి నిత్య సేవాకాలం, విశేష ప్రసాద నివేదనలు తీర్థగోష్టి , భక్తులందరికీ ప్రసాద వినియోగం నిర్వహించారు. తదుపరి స్వామివారి పుష్పయాగోత్సవం రెండోరోజు కార్యక్రమంలో భాగంగా అద్దాల మండపం వద్దకు తీసుకెళ్లి ఉత్సవమూర్తులను ఉయ్యాలలో ఉంచి ప్రత్యేక పూజలు, షోడోపచార పూజలు నిర్వహించారు. పండ్లు, పాలు నివేదన చేసి భక్తుల సమక్షంలో నీరాజనాలు సమర్పించారు. శ్రీవైష్ణవ దంపతులకు తాంబూలాలు అందజేసి నీరాట్టం సేవాకాలంతో స్వామివారికి పుష్పయాగోత్సవం పవళింపు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. పుష్పయాగోత్సవాల్లో ప్రధానార్చకులు వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రాజగోపాలాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. సుగంధ ద్రవ్యాల కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.

కూటమిలో రాజుకున్న వర్గపోరు

- చెప్పులు చూపించుకున్న తాజా, మాజీ సర్పంచ్‌లు
- గ్రామదేవత పండగలో ఘర్షణ

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాకుండానే వర్గపోరు మొదలైంది. మండలంలో చేనుల అగ్రహారం గ్రామంలో ఈ నెల 9న జరిగిన గ్రామ దేవత పండగలో కూటమి నేతలు కొట్టుకుని తీవ్ర గాయాలపాలైన ఘటన మరువక ముందే.. రేబాక గ్రామంలో ఆదివారం మొదలైన పోలిపల్లెమ్మ జాతరలో తాజా, మాజీ సర్పంచ్‌లు కొట్లాటకు సిద్ధమయ్యారు. ఒకరిని ఒకరు దూషించుకుంటూ చెప్పులు చూపించుకున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న పండగ సందర్భంగా ఈ నెల 18న జరిగే జాతరలో స్టేజీ ప్రోగ్రామ్‌లు పరిశీలనకు వచ్చిన ఎస్‌ఐ ముందే ఈ ఘటన జరగడంతో ఆయన ఇరువురిని హెచ్చరించి సర్దిచెప్పారు. అయితే గ్రామంలో పార్టీలకతీతంగా సర్పంచే పండగతో పాటు స్టేజీ ప్రోగ్రాం నిర్వహించడం ఆనవాయితీ. సర్పంచ్ టీడీపీ మద్దతుదారు కావడంతో జనసేనలో మరో వర్గానికి చెందిన నాయకులు కేవలం అమ్మాయిలతో రికార్డింగ్ డ్యాన్స్ పెట్టేందుకు పోలీసుల అనుమతి పొందామని చెబుతున్నారు. ఆలయం వద్ద సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టే ప్రోగాంకు బదులు మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో రికార్డింగ్ డ్యాన్స్ నిర్వహించడం మహిళలు, ప్రజలకు తీవ్ర ఆటంకంగా మారుతుందని, గ్రామంలో మరో చోట పెట్టుకోవాలని ప్రస్తుత సర్పంచ్ ఎస్ఐని కోరారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ మొదలైంది. రానున్న రెండు రోజుల పాటు జరిగే ఉత్సవంలో ఈ ఘర్షణ ఎలాంటి ప్రభావాలకు దారితీస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ప్రైవేట్ బస్సు నుంచి పొగలు

ప్రయాణికుల ఆందోళన


బస్సు వద్ద ప్రయాణికుల పడిగాపులు


డ్రమ్ములు పట్టేసిన వెనుక చక్రాలు

ఎస్.రాయవరం: అనకాపల్లి జిల్లాలో ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ బస్సు నుంచి ఎస్.రాయవరం మండలం, గెడ్డపాలెం వద్ద పొగలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం విశాఖ నుంచి హైదరాబాద్‌కు 36 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. గెడ్డపాలెం కూడలి వద్దకు వచ్చే సరికి బస్సు వెనుక టైర్ డ్రమ్ములు పట్టేయడంతో పొగలు వ్యాపించాయి. వాసన గమనించిన ప్రయాణికులు డ్రైవర్‌కు చెప్పి బస్సు నిలిపివేయించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. అక్కడకి చేరుకున్న నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. వేరే బస్సును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు.. డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. రాత్రి 10 గంటల నుంచి 12.30 గంటల వరకు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. చివరకు వేర్వేరు వాహనాల్లో గమ్యస్థానాలకు బయలుదేరారు.

పెదపూడిలో మూడు పాకలు దగ్ధం

- 10 మేకలు సజీవ దహనం
- రూ.4 లక్షల ఆస్తి నష్టం


అగ్నిప్రమాదంలో సజీవ దహనమైన మేకలు


పెదపూడిలో కాలిపోయిన పాకలు

బుచ్చెయ్యపేట: పెదపూడి శివారు రాజుపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పాకలు దగ్ధమవగా 10 మేకలు సజీవ దహనమయ్యాయి. గ్రామానికి చెందిన తండ్రికొడుకులు నమ్మి పైడయ్య, చిలుకులు మేకలు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి దూరంగా మూడు పాకలు వేసుకుని మేకలపై ఆధారపడి జీవిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పాల్చిపారేసిన సిగరెట్టు కారణంగా ఈ అగ్నిప్రమాదం జరగ్గా మూడు పాకలతో పాటు పాకల్లో ఈనిన మేకలు, పిల్లలు పది సజీవ దహనమయ్యాయి. సాయంత్రం పాకకు వచ్చిన పైడయ్య, చిలుకులు కాలిపోయిన పాకలు, మేకలను చూసి భోరున విలపించారు. సుమారు రూ.4 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఆరు ఎకరాల్లో జీడి, మామిడి తోటలు దగ్ధం


కుసుర్లపూడి సంభవించిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన జీడి, మామిడితోట

రోలుగుంట: కూసుర్లపూడి గ్రామానికి చెందిన రైతుల జీడితోటల్లో ఆదివారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో జీడి, మామిడి తోటలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పచ్చిగోళ్ల భవన్నారాయణకు చెందిన ఎకరా యాకలిప్టస్, మటం బెన్నయ్య, కూండ్రపు శ్రీను, గున్నంపల్లి కొండ, సియాద్రి అప్పారావుకి చెందిన జీడి, మామిడి తోటలు అయిదెకరాలు కాలిబూడిదయ్యాయి. దీనిపై బాధితులు తమకు ఎవరిపైనా అనుమానం లేదని తెలిపారు. ప్రమాదంలో వాటిల్లిన నష్టాన్ని సంబంధిత అధికారలు అంచనా వేసి పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

ఖైదీకి ఫోన్ ఇచ్చిన భార్యాభర్తల అరెస్టు

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు ఫోన్ ఇచ్చిన భార్యాభర్తలను ఆదివారం అరెస్టు చేశారు. ఇటీవల జైలులో ఖైదీల వద్ద ఫోన్లు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రభుత్వం విచారణ కమిటీ వేయగా జైలులో ఫార్మసిస్టుగా పనిచేసిన కడియం శ్రీనివాసరావు, అతని భార్య పుష్పలతలు నాగమల్లేశ్వరరావు అనే ముద్దాయికి ఫోన్ ఇచ్చినట్లు విచారణలో తేలింది. దీంతో విచారణ అధికారి, ఎస్ఐ కృష్ణ వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో శ్రీనివాసరావు ఖైదీలకు గంజాయి సరఫరా చేయడంతో విధుల నుంచి తొలగించారు. ఖైదీలకు ఫోన్ అందించే ఘటనలో కూడా శ్రీనివాసరావు నిందితుడిగా నిర్ధారణ కావడం చర్చనీయాంశమైంది.

ఇంటర్ మూల్యాంకనం వేళల మార్పు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణితం, సివిక్స్ సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనం వేళలు మార్పు చేసినట్లు ఆర్ఐవో మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ కేంద్రమైన ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఈనెల 17, 18 తేదీల్లో ఉదయం ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు ఉన్నందున మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ఆంధ్ర రాష్ట్రం.. పొట్టి శ్రీరాముల త్యాగఫలం


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌వో సత్యనారాయణరావు

తుమ్మపాల : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్గీయ పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న మద్రాసు, జార్జిటౌన్, అణ్ణాపిళ్ళై వీధిలోని 165వ నంబరు ఇంటిలో గురవయ్య, మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించారని తెలిపారు. వారి పూర్వీకులది ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని కనిగిరి ప్రాంతంలోని పడమటి పల్లె గ్రామమని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు గాంధేయ మార్గంలో నిరాహారదీక్ష చేసి ఆశయసాధన కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలి అమరజీవిగా నిలిచారని తెలిపారు. ఆయన స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల పోటీల్లో పాము హల్‌చల్


పాము తోక పట్టుకొని చూపుతున్న వ్యక్తి

కశింకోట: కశింకోటలోని కస్పావీధిలో జరిగిన పడమటమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఎడ్లబళ్ల పోటీలో ఓ పాము హల్‌చల్ చేయడం కలకలం సృష్టించింది. ఒక వ్యక్తి భయం లేకుండా జెర్రిగొడ్డుగా పిలిచే సుమారు 5 అడుగుల పొడవు ఉన్న పెద్ద పామును తోక పట్టుకుని తెచ్చి చూపుతూ, కొంతసేపు నేలపై విడిచి పెట్టి దాన్ని పరుగులు పెట్టిస్తూ కలియదిరిగాడు. దీంతో పోటీలు చూడడానికి వచ్చిన వారు పరుగులు తీసి వెళ్లి పామును ఆసక్తిగా వీక్షించారు. అయితే ఇది విష పూరితమైనది కాదని, దూరంగా పొలాల వైపు తీసుకెళ్లి ఆ వ్యక్తి విడిచిపెట్టారు.


అనకాపల్లిలో ఆదివారం వేకువజామున మంచు తెరలను చీల్చుకుంటూ ఉదయిస్తున్న సూర్యుడు


బొజ్జన్న కొండకు వెళ్లే దారిలో దట్టంగా కురుస్తున్న మంచు


ఎండకు నిర్మానుష్యంగా మారిన నాలుగు రోడ్ల కూడలి

అలరిస్తున్న విభిన్న వాతావరణం

అనకాపల్లి టౌన్: అనకాపల్లి ప్రజలు అధిక మంచు, ఎండ తీవ్రత రెండింటిని చవి చూస్తున్నారు. పట్టణం, మండలంలో అధిక మంచు కురుస్తోంది. ఆదివారం ఉదయం ఏడు గంటలైనా మంచుతెరలు వీడలేదు. కనీసం వంద మీటర్ల దూరంలోని రోడ్డు కూడా సరిగ్గా కనిపించలేదు. దీంతో ప్రకృతి ప్రేమికులు మంచును ఆస్వాదిస్తూ దైనందిన కార్యక్రమాల్లో లీనమవుతున్నారు. కాస్త సమయం గడిచి తొమ్మిది గంటలయ్యేసరికి ఎండ ప్రతాపం చూపించింది. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. సెలవు దినం కావడంతో ఎక్కువ శాతం ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తప్పనిసరి పనులపై వచ్చేవారు ప్రత్యామ్నాయ మార్గాలతో ఉపశమనం పొందారు.

క్లుప్తంగా

జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం ఎన్నిక



ఎన్నికైన ఏపీటీఎస్ఏ జిల్లా నూతన కార్యవర్గం

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ అండ్ అకౌంటెంట్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీటీఏఎస్ఏ) అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా యు. వెంకటేష్, జిల్లా కార్యదర్శిగా వి. సింహాచలం నాయుడు, జిల్లా ట్రెజరర్‌గా వై. వెంకటేష్, సహాధ్యక్షుడిగా పి.రాజేష్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎస్. కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పొగమంచుతో ఇక్కట్లు



కశింకోటలో చెట్లపై దట్టంగా వ్యాపించిన పొగ మంచు

కశింకోట: కశింకోటలో ఆదివారం పొగ మంచు ప్రజలు, రైతులను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఉదయం నుంచి సుమారు రెండు గంటల పాటు దట్టమైన మంచు పడింది. వీధులు, ఇళ్లు, చెట్లు, పొలాలకు వెళ్లే దారులు పొగ మంచుతో నిండిపోయాయి. దీంతో పొలాలకు వెళ్లే రైతులు దారి సరిగా కనిపించక ఇబ్బంది పడ్డారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో సూర్య తాపానికి మంచు పొరలు తొలగడంతో ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

సరుగుడు జలపాతం కళకళ



సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల సందడి

నాతవరం: సరుగుడు జలపాతం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఎత్తైన రెండు కొండల నడుమ ప్రవహించే నీటిలో జలకాలు ఆడుతూ సరదగా గడిపారు. ఉమ్మడి విశాఖతో పాటు తూర్పుగోదావరి జిల్లాల నలు మూలల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతం కళకళలాడింది. ద్విచక్ర వాహనాలు, కార్లు అధిక సంఖ్యలో రావడంతో సరుగుడుకు వెళ్లే మార్గంలో వాహనాల రద్దీ నెలకొంది.

మూగజీవాల కోసం ప్రత్యేక చలివేంద్రం



మూగజీవాల చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూర్యనారాయణ

కె.కోటపాడు : పదేళ్లుగా వేసవి సమయంలో మూగజీవాలకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న కుభిరెడ్డి రాధాకృష్ణ, వరలక్ష్మి అభినందనీయులని కింతాడ గ్రామానికి చెందిన రావాలమ్మ తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు కన్నూరు సూర్యనారాయణ అన్నారు. కూండ్రపువానిపాలెంలో రాధాకృష్ణ ఇంటి పరిసరాల్లో ఏర్పాటు చేసిన మూగజీవాల చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. సామాజిక బాధ్యతతో ఇంటి పరిసరాల్లో పక్షులతో పాటు మూగజీవాలకు నీటిని ప్రత్యేక పాత్రలలో అందుబాటులో ఉంచుతూ వాటి దాహార్తిని తీర్చుతున్నట్లు రాధాకృష్ణ, వరలక్ష్మి తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	:రాజా
ఆఫీసర్ ఆన్ డ్యూటీ	:సత్యనారాయణ స్క్రీన్-1
యుగానికి ఒక్కడు	:సత్యనారాయణ స్క్రీన్-2
కోర్ట్	:పర్తిసాయి
దిల్‌రూబా	:షిర్డీసాయి
థౌజండ్ వాలా	:వెంకటేశ్వర(ఉదయం)
న్యూ పోలీస్ స్టోరీ	:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
తండేల్	:శ్రీసత్య
ఛావా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-32 యూనిట్లు, ఓ పాజిటివ్-34 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ లోకేషను (9703619706 సంప్రదించవచ్చు.

నత్తనడకన రీ-సర్వే

- కష్టంగా సరుగుడు తోటల్లో రీడింగ్ పాయింట్ల గుర్తింపు
- అందుబాటులో లేని రికార్డులు
- చాలీచాలని సిబ్బందే కారణమంటున్న అధికారులు



రీ-సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి (ఫైల్)

కశింకోట: మండలంలోని తీడ గ్రామంలో ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూముల రీ-సర్వేలో జాప్యం జరుగుతోంది. నిర్ణీత గడువు సమీపిస్తున్నప్పటికీ సగం కూడా సర్వే పూర్తి కాలేదు. తగినంత మంది సిబ్బంది అందుబాటులో లేకపోవడం, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలించకపోవడం, భూముల రికార్డులు అందుబాటులో లేకపోవడం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన రీ-సర్వే పూర్తి చేసి భూ సమస్యలను పరిష్కరించాలంటున్నారు. మండలం చివరన ఉన్న తీడ గ్రామాన్ని రీ-సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో రీ-సర్వే నిర్వహించి ఆదర్శంగా తీసుకోవడానికి గాను మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. దీనిలో భాగంగా తీడ గ్రామాన్ని సర్వేకు ఎంపిక చేసిన మేరకు గత నెల 3న సర్వే చేపట్టారు. మండలంలో ఉన్న సర్వేయర్లు, వీఆర్‌వోలు, సిబ్బందిని పది బృందాలను ఏర్పాటు చేసి సర్వే ప్రారంభించారు. తీడ గ్రామ రెవెన్యూ పరిధిలో తీడ, కచ్చర్లపాలెం, రెడ్డివానిపాలెం తదితర గ్రామాల భూములున్నాయి. మొత్తం 3,152.77 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉంది. దీనిలో జిరాయితీ 1338.94 ఎకరాలు కాగా, మిగిలిన 1813.83 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిని ఒక్కొక్క బృందం రోజుకి 20 ఎకరాల వంతున సర్వే చేయాలని నిర్దేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్డీవో షేక్ అయిషా తదితర అధికారులు సర్వే కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు సర్వేను పర్యవేక్షిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలోను, రికార్డుల పరంగా పరిస్థితులు అనుకూలించక సర్వేలో మందగమనం తప్ప లేదు. తీడ పరిధిలో ఎక్కువగా సరుగుడు, జీడి మామిడి, మామిడి వగైరా తోటలు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో సరుగుడు సాగులో ఉన్న భూములను సర్వే చేయడానికి వినియోగించే రోవర్లు, ఇతర కొలతల సామగ్రితో రీడింగ్ పాయింట్లు గుర్తించలేకపోతుండటంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. దీంతో ఒక్కొక్క బృందం నిర్దేశించిన మేరకు రోజుకి 20 ఎకరాలకు బదులు దాదాపు సగం మాత్రమే సర్వే చేయడానికి అవకాశం కలుగుతుందంటున్నారు. అలాగే భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు అందుబాటులో లేని పరిస్థితి ఉందంటున్నారు. ఇది సర్వేలో జాప్యానికి మరో కారణమవుతుందటున్నారు. మరో వైపు గత ఏడాది ప్రభుత్వం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభల్లో వచ్చిన భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కొంత మంది రెవెన్యూ సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. దీంతో ఇప్పుడు రోజుకి పదికి బదులు 7 బృందాలు మాత్రమే సర్వే నిర్వహిస్తున్నాయి. వీటిలో రెండు బృందాలు ప్రభుత్వ భూములను, మిగిలిన ఐదు బృందాలు జిరాయితీ భూములను సర్వే చేస్తున్నాయి. దీనివల్ల సిబ్బంది కొరతతో నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తయ్యే పరిస్థితి లేదు. ఈ నెల 20లోగా రీ-సర్వే పూర్తి చేయాలని అధికారులు నిర్దేశించారు. అయితే ఇప్పటికి దాదాపు 40 శాతం వరకు అంటే 1233.21 ఎకరాల భూములకు మాత్రమే రీ-సర్వే అయిందంటున్నారు. పైగా రీ-సర్వే నిర్వహణకు నాలుగు నెలలు గడువు విధించినా ఇక్కడ మాత్రం డిసెంబర్‌లో ప్రారంభం కావలసిన రీసర్వే రెండు నెలల తర్వాత ఆలస్యంగా ఫిబ్రవరిలో ప్రారంభమైంది. దీనివల్ల కూడా జాప్యానికి కారణం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామంటున్నారు.



తీడ సరుగుడు తోటల్లో రీ-సర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

ఆలస్యానికి పలు కారణాలు..

తీడ గ్రామ రెవెన్యూ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూముల రీ-సర్వే త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 20లోగా సర్వే పూర్తి చేయాలని నిర్దేశించారు. అయితే సరుగుడు తోటల్లో రీడింగ్ పాయింట్లు గుర్తించడం కష్టమవుతుండటంతో సర్వే చేయడానికి సమయం ఎక్కువగా తీసుకుంటుండటం, సిబ్బంది ఇతర సమస్యల పరిష్కారంలో నిమగ్నమై ఉండటం, సర్వే ఆలస్యంగా ప్రారంభించడం తదితర కారణాల వల్ల రీ-సర్వే ఆలస్యం అవుతోంది. ఇప్పటికి 3152.77 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉండగా, 1233.21 ఎకరాల మేర సర్వే పూర్తి అయింది. సాధ్యమైన మేరకు ఈ నెలాఖరులోగా రీ-సర్వే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– జి. భాస్కరరావు, రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్, కశింకోట

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి

అనకాపల్లి టౌన్: సార్వత్రిక ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, అందుకు అనుగుణంగా రాష్ట్ర శాసన సభలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం బీసీ సంక్షేమ నూతన కార్యవర్గం ఎన్నిక, సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారంలో జనాభా నిష్పత్తి ప్రకారం అధికారాన్ని పంచాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ అధ్యక్షురాలిగా పెదపాటి కళ్యాణి, రాష్ట్ర యూత్ కమిటీ కార్యదర్శిగా చింతకాయల కొర్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిల్లల శంకర్రావు, జిల్లా యూత్ కార్యదర్శులుగా సిమ్మ శ్రీను, ఎలమంచిలి ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంధం వెంకట రమణ, రాష్ట్ర ఇన్‌చార్జి వై. నూకాలమ్మ, ఉపాధ్యక్షుడు బర్నికాన బాబూరావు, కార్యదర్శి కొణతాల అప్పలరాజు, యువజన విభాగం అధ్యక్షుడు లద్దిక మల్లేష్, కన్వీనర్ చల్లంగి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కలిగిన వ్యక్తి అరెస్టు

తుమ్మపాల: అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు పట్టుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై వరికుమార్ అందించిన వివరాల ప్రకారం మండలంలో తగరంపూడి గ్రామానికి చెందిన ఆడాడి ప్రభాకరరావు అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఆదివారం నిఘా పెట్టగా అతని వద్ద 48 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా పడమటమ్మ తీర్థ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో పడమటమ్మ అమ్మవారు



ఫోం జారుడు బల్లపై జారుతున్న చిన్నారులు



అన్న సమారాధన నిర్వహణ

కశింకోట: స్థానిక కస్పావీధిలో వెలసిన పడమటమ్మ తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూలమాలలతో అందంగా అలంకరించారు. అమ్మవారి విగ్రహానికి పూలమాలలతో పాటు రూపాయి, రూ.20 కరెన్సీ నోట్లతో మాల కట్టి అలంకరించారు. ఇవి ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఎక్కువ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీశెట్టి రామకృష్ణ (రాంకీ), టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ తదితరులు అమ్మవారిని దర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి జ్ఞాపికలు అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. అనంతరం మహిళల కోలాటాలు ప్రదర్శించారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తీర్థ మహోత్సవం సందర్భంగా తిను బండారాల విక్రయాలు జరిగాయి. మినీ ఆకాశ చక్రంపై పిల్లలు తిరుగాడారు. ఫోం జారుడు బల్లపై జారుతూ చిన్నారులు ఆనందంగా గడిపారు. రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాణ సంచా కాల్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గొంతిన గోపి, గొంతిన అప్పలనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మహిళల కోలాటం ప్రదర్శన

'ఉపాధి' బకాయి బిల్లులు చెల్లించాలి



వి.సంతపాలెంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : ఉపాధి వేతనదారులకు 11 వారాలకు సంబంధించిన బకాయి బిల్లులను అధికారులు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలో సూర్రెడ్డిపాలెం, వి.సంతపాలెం, వారాడ, ఆనందపురం, పోతనవలస, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎస్సీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సదుపాయం ఉన్నా వి.సంతపాలెం గ్రామంలో పలువురికి విద్యుత్ బిల్లులు పంపడం దారుణమన్నారు. సూర్రెడ్డిపాలెం చెరకు కాటా వద్దకు తీసుకువచ్చిన చెరకు 20 రోజులుగా అక్కడే ఉందన్నారు. చెరకు ఎండిపోవడం కారణంగా రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

సొసైటీల్లో వారం రోజుల్లో కంప్యూటరీకరణ పూర్తి



వడ్డాది కో-ఆపరేటివ్‌లో మాట్లాడుతున్న డీసీవో స్వరూపరాణి

బుచ్చెయ్యపేట: జిల్లాలో ఉన్న అన్ని కో-ఆపరేటివ్ సొసైటీలు వారం రోజుల్లోగా కంప్యూటరీకరణ పూర్తి చేయాలని డీసీవో స్వరూపరాణి తెలిపారు. ఆదివారం ఆమె వడ్డాది కో-ఆపరేటివ్‌లో రికార్డుల కంప్యూటరీకరణను ఆమె పరిశీలించారు. అనంతరం వడ్డాది, మాడుగుల, బంగారుమెట్ట తదితర సొసైటీల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులకు సులువుగా వేగవంతంగా రుణ సౌకర్యం కలిగేలా రికార్డులను కంప్యూటరీకరణ పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పలు సొసైటీల్లో కంప్యూటరీకరణ చివరి దశకు చేరగా.. మిగిలిన సొసైటీలు వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కిరణ్‌కుమార్, ఎస్.మురళి, మాడుగుల బ్రాంచ్ మేనేజర్ మహేశ్వరరావు, వడ్డాది సెక్రటరీ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి విరాళాలు



రూ.40 వేలు విరాళం అందజేస్తున్న సుధీర్



రూ.25 వేలు విరాళం అందిస్తున్న త్రిమూర్తులు తదితరులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి బందారుపేటలో ఇటీవల నూతనంగా నిర్మించిన కోదండ రామాలయానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. నక్కపల్లికి చెందిన నున్న సుధీర్ రూ.40 వేలు, నర్సీపట్నం మండలం బాలారం గ్రామానికి చెందిన వానపల్లి త్రిమూర్తులు రూ. 25 వేలు ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయానికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడం, ఆలయ నిర్వాహణ తదితర అభివృద్ధి పనుల కోసం వీటిని వినియోగించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. విరాళాలు అందజేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మరపురాని మహనీయుడు.. పొట్టి శ్రీరాములు

- పలు చోట్ల ఘన నివాళి
- ఆయనకు భారతరత్న ప్రకటించాలని డిమాండ్



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రావణి, సీఐ విజయ్‌కుమార్



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అబ్దుల్ కలాం సేవా సంఘం ప్రతినిధులు



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పలు చోట్ల అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డీఎస్పీ ఎం. శ్రావణి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష భారత రాజకీయ చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ టీవీ విజయకుమార్, ఎస్ఐ సురేంద్ర కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు భవన్‌లో..

పట్టణంలోని పొట్టి శ్రీరాములు భవన్ నిర్వాహకులు పీఎల్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులకు తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు వేషధారణ పోటీలు నిర్వహించారు. అతిథులుగా వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ కొల్లూరు పార్వతి, అర్చక ఐకాన్ పేరూరి చిన్ని స్వామి, భోగలింగేశ్వర స్వామి చైర్మన్ సత్యనారాయణ పాల్గొని పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేశారు.

అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో..

పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరాలకు ఆదర్శమని అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ అన్నారు. రామచంద్ర థియేటర్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించేలా ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. అంబేద్కర్ సేవా సమితి జిల్లా కో ఆర్డినేటర్ బండి అప్పారావు, నటభూషణ్ శోభన్‌బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, చింతా లక్ష్మణ్‌రావు, చరణ్‌రాజ్, సత్తిబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కన్యకాపరమేశ్వరీ ఆలయం జంక్షన్‌లో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అన్నారు. ఆయనకు తక్షణం భారతరత్న పురస్కారం ప్రకటించాలని కోరారు. పట్నాల కృష్ణమోహన్, వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరావు, బొడ్డు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: కొత్తకోటలో ఆంజనేయస్వామి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. సాయంత్రం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న ఎడ్లబళ్ల పోటీలు



కశింకోటలోని కస్పావీధిలో నిర్వహిస్తున్న ఎడ్ల బళ్ల పరుగు పోటీలు



ఉత్సాహంగా తిలకిస్తున్న ప్రజలు

కశింకోట: కశింకోటలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు ఆదివారం సాయంత్రం ఉత్సాహభరితంగా సాగాయి. స్థానిక కస్పావీధిలో వెలసిన పడమటమ్మ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలు నిర్వహించారు. పిల్లలతో పాటు పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను ఆద్యంతం ఆనందోత్సాహాలతో వీక్షించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 11 ఎడ్ల బళ్లు పోటీలో పాల్గొన్నాయి. ఎస్ఐ కె. లక్ష్మణరావు సిబ్బందితో పర్యవేక్షించారు.

దండి సురవరం ఎడ్ల బండికి ప్రథమ బహుమతి..

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలో దండి సురవరం గ్రామానికి చెందిన హర్ష వర్ధన్‌నాయుడు ఎడ్ల బండికి ప్రథమ స్థానం లభించింది. బి. కొత్తూరుకు చెందిన మురుకుర్తి శంకరరావు బండికి ద్వితీయ స్థానం, ఎం.కోటపాడుకు చెందిన పాసిలి నాగరాజు బండికి తృతీయ, చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ బండికి నాలుగు, మామిడిపల్లికి చెందిన లెక్కల సత్యనారాయణ బండికి పంచమ, నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన శివ తేజ బండికి ఆరవ స్థానం లభించాయి. ఉత్సవ నిర్వాహకులు వారికి నగదు బహుమతులు అందజేశారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

మునగపాక: మండలంలోని మెలిపాక దళితవాడలో కల్యాణ మండపం నిర్మించేందుకు ఆదివారం భూమిపూజ చేశారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ రూ.22 లక్షల ఎస్సీ, ఎస్టీ నిధులు మంజూరు చేయించారు. దీంతో సంబంధిత పనులకు సర్పంచ్ అయినంపూడి విజయభాస్కరరాజు, వైఎస్సార్‌సీపీ దళిత నేత గుంట్ల అప్పారావు, కూటమి నేతలు రాజశేఖర్, గణేష్ తదితరులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విజయ భాస్కరరాజు మాట్లాడుతూ మెలిపాక పంచాయతీ పరిధిలోని దళితవాడలో కల్యాణ మండపం, ప్రహరీ నిర్మాణానికి జిల్లా పరిషత్ ద్వారా నిధులు కేటాయించిన స్వామి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.